క్లుప్తంగా

సిగ్మా లైఫ్‌స్పాన్ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

సుభాష్‌నగర్: జీడిమెట్లలోని సిగ్మా లైఫ్ స్పాన్ ఆస్పత్రిలో మహిళకు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. ఆమె కడుపులో 36 కణతులను తొలిగించి మహిళ ప్రాణాలు కాపాడారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి డైరెక్టర్ సురేష్ తెలిపారు. ప్రస్తుతం మహిళ ఆరోగ్యం నిలకడగా ఉందని, మూడు రోజుల్లో డిశ్చార్జ్ చేస్తామన్నారు.

పైప్‌లైన్ నుంచి బండరాయి తొలగింపు



వాటర్ పైప్‌లైన్‌ను కట్ చేయడంతో బయట పడిన బండరాయి

చింతల్: సంజయ్ గాంధీనగర్‌లో క్యూబిడ బ్ల్యూపీఎస్ అనే పరికరాన్ని ఉపయోగించి పైప్‌లైన్‌లో ఉన్న భారీ బండరాయిని సోమవారం జలమండలి అధికారులు గుర్తించారు. అనంతరం అదే పరికరం సహాయంతో అది ఎంత దూరంలో ఉందో, అక్కడ వరకు పైప్లైన్‌ను కట్ చేసి ఆ రాయిని తొలగించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఈ సమస్య పరిష్కారంలో డీజీఎం అప్పలనాయుడు, మేనేజర్లు రమ్య, భారతి, రోహిణి ముఖ్య భూమిక పోషించారు.

ఒత్తిడిని అధిగమించడానికి 'జియో జీ భర్ కే' కోర్స్

నిజాంపేట్: సుఖమయ జీవితానికి 'జియో జీ భర్ కే' ఉపయోగ పడుతుందని కోచ్ రాజశేఖర్ అన్నారు. సోమవారం ప్రగతినగర్‌లోని సుందరయ్య భవన్‌లో 22 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరికి ఉపయోగపడే విధంగా, అన్ని విషయాలను ఆస్వాదిస్తూ, హుందాగా, ఆనందంగా జీవితాన్ని కొనసాగించడం కోసం రూపొందించిన ఆచరణాత్మక కోచింగ్ 'జియో జీ భర్ కే'కు సంబంధించి డెమో ఇచ్చారు. ఒత్తిడి, విరక్తి, భయం, భ్రమ, అహంకారం, అపోహలు, అసూయ, కలతలు, గతం, అలసత్వం, నిరాశలను అధిగమించడానికి ఈ కోర్స్ దోహద పడుతుందన్నారు.

మర్యాదపూర్వక కలయిక



సర్వే సత్యనారాయణను కలిసిన ఆల్ ఇండియా దళిత సేన అధ్యక్షుడు జేమ్స్

కుత్బుల్లాపూర్: ఆల్ ఇండియా దళిత సేన అధ్యక్షుడు అవిజె జేమ్స్ డాక్టరేట్ పట్టా అందుకున్న నేపథ్యంలో సోమవారం కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు దమ్మని శ్రవణ్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, బాలరాజ్, వినోద్ కుమార్, ప్రవీణ్ కుమార్, సల్మాన్ రాజు, అమృతయ్య, రామకృష్ణగౌడ్, కమలమ్మ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

27న నిధి ఆప్‌కే నిఖత్

పటాన్‌చెరు టౌన్: భవిష్యనిధి సంస్థ ద్వారా ప్రతి నెలా సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల్లో భాగంగా నిధి ఆప్ కే నిఖత్ 2.0 ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ప్రాంతీయ కమిషనర్ విశాల్ అగర్వాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3 కేంద్రాల్లో 3 శిబిరాలను ఉదయం 9:30 గంటల నుంచి 5:45 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. రంగారెడ్డి జిల్లాకు సంబంధించి రామచంద్రాపురం తహసీల్దార్ కార్యాలయం, లేబర్ ఆఫీసు కార్యాలయాల్లో.. సంగారెడ్డి జిల్లాకు సంబంధించి సంగారెడ్డి శాంతినగర్‌లోని విద్యుత్ కార్యాలయం, మెదక్ జిల్లాకు సంబంధించి కలెక్టరేట్ కార్యాలయంలో శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భవిష్యనిధి సమస్యలు ఉన్నవారు పైన పేర్కొన్న మూడు కేంద్రాల్లో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

'జన్ కీ బాత్ చాయ్ పే చర్చా' ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

శేరిలింగంపల్లి పీసీసీ ప్రతినిధి సత్యంరావు

హఫీజ్‌పేట్: 'జన్ కీ బాత్ చాయ్ పే చర్చా' కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం పీసీసీ ప్రతినిధి సత్యంరావు పేర్కొన్నారు. సోమవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలకు బూత్ స్థాయిలో పార్టీ బలోపేతానికి, త్వరలో మొదలు కాబోతున్న 'జన్ కీ బాత్ చాయ్ పే చర్చా' కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని పార్టీ నాయకత్వానికి దిశా నిర్దేశం చేశారు.

ఎన్నికల బంధు

- నియోజకవర్గానికి 1,100 మందికి దళిత బంధు
- రెండో విడత అమలుకు అధికార యంత్రాంగం సన్నాహాలు
- ప్రజాప్రతినిధుల సమన్వయంతో కలెక్టర్ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ
- మొదటి విడతలో నియోజకర్గానికి 100 మందికి మాత్రమే లబ్ధి
- లబ్ధిదారుల ఎంపికలోనూ ఆరోపణల నేపథ్యంలో ప్రత్యేక చర్యలు
- సమగ్ర సర్వే ఆధారంగా మండలాలు, డివిజన్లు వార్డుల వారీగా ఎస్సీల జాబితా వివరాల సేకరణపై కసరత్తు



సాక్షి, మేడ్చల్ జిల్లా: దళిత కుటుంబాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం అమలుకు గ్రేటర్‌తో సహా శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని సంబంధిత అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మొదటి విడతలో నియోజకవర్గానికి 100 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి యూనిట్లను గ్రౌండింగ్ చేసిన తెలంగాణ సర్కారు.. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఒక్కో నియోజకవర్గంలో 1,100 చొప్పున గ్రేటర్‌తోసహా శివారు జిల్లాల పరిధిలోని 27 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 29,700 మంది దళిత కుటుంబాలకు వర్తింపజేసేందుకు దళిత బంధు పథకాన్ని ముందుకు తీసుకెళ్తోంది. ఈ నేపథ్యంలో గ్రేటర్ సహా శివారు జిల్లాల సంబంధిత అధికారులు కూడా దళిత బంధు పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

మండలాల వారీగా సేకరణ

లబ్ధిదారుల ఎంపికకు జిల్లాల వారిగా సంబంధిత అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రూరల్‌లో మండలాలు, పురపాలక సంఘాల్లో డివిజన్లు/వార్డుల వారీగా ఎస్సీ జనాభా, కుటుంబాల సంఖ్య తదితర వివరాలు సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా సేకరిస్తున్నారు. రెండు రోజుల కిందట ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ కలెక్టర్లకు లబ్ధిదారుల ఎంపికకు అనుసరించాల్సిన విధివిధానాలపై సూచనలు చేశారు. రెండో విడత దళిత బంధు పథకం అమలుకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేకంగా జీవోను జారీ చేసింది.

విధి విధానాలపై కసరత్తు

ఒక్కో దళిత కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేసి, వారి ఉన్నతికి తోడ్పడటమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. మొదటి విడతలో లబ్ధిదారులను ఎమ్మెల్యేలు ప్రతిపాదించగా ఇన్‌చార్జి మంత్రి ఆమోదించారు. దీంతో ఎంపిక పూర్తిగా ఏకపక్షంగా చేశారనే విమర్శలు వెల్లువెత్తాయి. కొందరు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ప్రభుత్వం రెండో విడత ఎంపికకు ప్రత్యేకంగా మార్గదర్శకాలు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రజాప్రతినిధుల సమన్వయంతో కలెక్టర్లు లబ్ధిదారులను ఎంపిక చేయాలని ప్రభుత్వం మౌఖికంగా ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

అక్రమాలు అరికడితేనే ప్రయోజనం

గ్రేటర్ సహా శివారు జిల్లాల్లో మొదటి విడత దళిత బంధులో ఎంపికై న లబ్ధిదారుల్లో కొందరు యూనిట్లు విక్రయించుకున్నారనే ఆరోపణలున్నాయి. మరికొందరు యూనిట్లు స్థాపించుకుని ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగుతున్నారు. కొందరు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు దళారులుగా వ్యవహరించి లబ్ధిదారుల నుంచి యూనిట్లను కాజేసినట్లు విమర్శలు ఉన్నాయి. మెజారిటీ లబ్ధిదారులు వాహనాల కొనుగోలుకే మొగ్గుచూపారు. దీంతో ఉపాధి కొరవడి వాటిని నిర్వహించే ఆర్థిక స్తోమత లేక తక్కువ ధరకే విక్రయించుకుంటున్నట్లు తెలుస్తోంది. రెండో విడత దళిత బంధులో గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అధికార యంత్రాంగం భావిస్తున్నట్లు తెలుస్తోంది. దళారుల బెడద లేకుండా నేరుగా లబ్ధిదారుల సమక్షంలోనే యూనిట్ల ఎంపికపై అవగాహన కల్పించాల్సింది. ఉపాధి కల్పనపై ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించే దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

మొదటి విడతలో 2,700 మందికే..

మొదటి విడత దళిత బంధు పథకంలో భాగంగా గ్రేటర్ సహా శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో 100 చొప్పున 27 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2,700 మందికి దళిత బంధు పథకాన్ని వర్తింపజేశారు.

'ప్రత్యేక రాష్ట్రంలో పేదలకు మిగిలింది నిరాశే'

నిజాంపేట్: ఎన్ని ప్రభుత్వాలు మారినా పేదల బతుకులు మాత్రం మారడం లేదని.. ప్రత్యేక రాష్ట్రంలో తమ బతుకుల మారతాయని ఆశలు పెట్టుకున్న ప్రజానీకానికి నిరాశే మిగిలిందని ప్రజా సంఘాల జిల్లా నాయకుడు బాలపీరు, సీఐటీయూ జిల్లా నాయకుడు చంద్రశేఖర్ అన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వాలన్న ప్రజా సంఘాల పిలుపు మేరకు సోమవారం బాచుపల్లి మండల కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో టైపిస్ట్ మహేందర్‌కు వినతి పత్రం అందజేశారు.

◆ అనంతరం నాయకులు మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం అవతరించి దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్నా పేదలకు గూడు కరువైందన్నారు. రాష్ట్రంలోని 17 జిల్లాల్లోని 61 కేంద్రాల్లో లక్షలాది మంది గుడిసెలు వేసుకుని నివాసముంటున్న వారికి పట్టాలు ఇవ్వలేదన్నారు. పోలీసులతో అరెస్టులు చేయించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు మద్దతుగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

◆ పేదలకు గృహలక్ష్మి పథకం కింద రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. బీసీ రుణాలు లక్ష రూపాయలు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగుల బంధు, గిరిజన బంధు, దళిత బంధులను వెంటనే అమలు చేయాలని నినదించారు. ఈ నిరసనలో కేవీపీఎస్ మండల అధ్యక్షుడు స్వామి, మండల నాయకులు శీను, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం

సుభాష్‌నగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు సొంతింటిని కల్పించడంలో విఫలయ్యాయని ప్రజా సంఘాల పోరాట వేదిక నాయకులు లక్ష్మణ్, అంజయ్య ఆరోపించారు. సోమవారం సీఐటీయూ, డీవైఎఫ్ఐ, ఐద్వా, కేవీపీఎస్‌ల ఆధ్వర్యంలో పేదలకు డబుల్ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. జులై 2వ తేదీన మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చారు.

'సర్కారు బడుల్లో వసతులు మెరుగు పడటం లేదు'



జైరామ్‌నగర్‌లో భూపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన యువకులు

కుత్బుల్లాపూర్: మన బడి కార్యక్రమానికి కోట్లాది నిధులు వెచ్చిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ గొప్పలు చెప్పుకుంటున్నా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు మెరుగు పడటం లేదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. సోమవారం జీడిమెట్ల డివిజన్ కృష్ణానగర్, జైరామ్‌నగర్, విమానపురి కాలనీలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన పాదయాత్ర చేపట్టారు. జైరామ్‌నగర్‌లో ప్రభుత్వ పాఠశాల మూసివేసిన విషయాన్ని తెలుసుకున్న భూపతిరెడడి పాఠశాలను సందర్శించారు. పాఠశాల పునః ప్రారంభించే వరకు విద్యాశాఖపై ఒత్తిడి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండి శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బైరి ప్రశాంత్‌గౌడ్, యాదిరెడ్డి, రాముగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు..

జైరామ్‌నగర్‌కు చెందిన బీజేపీ నాయకుడు రాకేష్ తన 50 మంది మిత్ర బృందంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి భూపతిరెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ప్రగతి భవన్‌ను ముట్టడిస్తాం

- కలెక్టరేట్ ముట్టడిలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కేఎల్.మూర్తి
- పాఠ్యపుస్తకాలు, టీచర్లు లేకుండా పాఠాలు ఎలా చదవాలి..?
- ప్రైవేటులో ఫీజులు అడ్డగోలుగా వసూలు చేస్తున్నా పట్టదా..?
- విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా

సాక్షి, మేడ్చల్ జిల్లా: విద్యా సంవత్సరం ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా.. ఇప్పటి వరకు తెలంగాణ ప్రభుత్వ విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కేఎల్.మూర్తి తీవ్రంగా ధ్వజమెత్తారు. సకాలంలో సమస్యలు పరిష్కరించకుంటే ప్రగతి భవన్ ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు అందిస్తామని గొప్పలు చెప్పినా, ఇప్పటి వరకు రాష్ట్రంలో ఎక్కడా యూనిఫామ్ రాలేదన్నారు. తెలంగాణ విద్యా దినోత్సవానికి విద్యార్థులు పాఠశాలలకు పాత బట్టలతోనే హాజరయ్యారని ఎద్దేవా చేశారు.

◆ అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ సమస్యలపై భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు మేడ్చల్ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎల్.మూర్తి మాట్లాడుతూ ఇంటర్మీడియట్, గురుకుల, సంక్షేమ హాస్టళ్లకు పాఠ్యపుస్తకాలు పంపిణీ కాలేదని, పేద విద్యార్థులు ఎలా చదువుకోవాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో 24 వేల టీచర్, 12 వేల లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఒక మేడ్చల్ జిల్లాలో 15 మండలాలు ఉంటే.. ముగ్గురు విద్యాధికారులు మాత్రమే పని చేయటం సిగ్గుచేటన్నారు.

◆ కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నా ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇంజినీరింగ్, మెడికల్ సీట్ల ఫీజులకు నియంత్రణ లేదని, వెంటనే నియంత్రణ చట్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి రాథోడ్ సంతోష్, జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేష్ మాట్లాడుతూ జిల్లా పరిధిలో ప్రైవేట్, కార్పొరేట్, ఇంటర్నేషనల్ పాఠశాలలు, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పేరుతో రూ.లక్షల వ్యాపారం చేస్తున్నా.. ప్రభుత్వం చోద్యం చూస్తోందని పేర్కొన్నారు.

◆ కలెక్టరేట్ ముట్టడిలో భాగంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులను అరెస్టు చేసి శామీర్‌పేట పీఎస్‌కు తరలించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కిరణ్, అరుణ్, ప్రసాద్, శ్రీను, శ్రీశైలం, నరసింహ, పవన్ పాల్గొన్నారు.

'డ్రగ్ ఫ్రీ సొసైటీ' లక్ష్యంగా సాగాలి

- కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ జితేంద్రకుమార్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాయదుర్గం: 'డ్రగ్ ఫ్రీ సొసైటీ' ఏర్పాటే లక్ష్యంగా సాగాలని కేంద్రీయ విద్యాలయ గచ్చిబౌలి ప్రిన్సిపల్ జితేంద్రకుమార్ సూచించారు. డ్రగ్స్ వినియోగంతో ఎదురయ్యే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సోమవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. 'ఇంటర్నేషనల్ డ్రగ్ అబ్యూజ్ డే'తో గచ్చిబౌలిలోని జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయలో ప్రిన్సిపల్ జితేంద్రకుమార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు డ్రగ్స్ వినియోగంతో ఎదురయ్యే అనర్థాలపై పెయింటింగ్స్, స్లోగన్స్, డిబేట్ తదితర పోటీలను నిర్వహించారు. విద్యార్థులు వేసిన పెయింటింగ్స్, స్లోగన్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని విద్యాలయ లైబ్రేరియన్ శివకృష్ణశాస్త్రి, పీజీటీ హిందీ అపర్ణా, ఇంగ్లిష్ పీజీటీ వందన మనహస్ పర్యవేక్షించారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో... టమాట 80, పచ్చిమిర్చి100, బెండ 45, కాకర 60, దొండ 35, దోస 30, ఆలు 25, చామ 50, కీర 35, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 120, బీట్‌రూట్ 60, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 30, క్యారెట్ 70, చిక్కుడు 70, ఉల్లి 100 (5 కేజీలు), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 40 సొరకాయ (కేజీ) 30, అల్లం 220, వెల్లుల్లి 160.

సంక్షేమ సంఘాలు కాలనీల అభివృద్ధిలో పాలుపంచుకోవాలి



బీఆర్ఎస్ సీనియర్ నేత కేఎంప్రతాప్‌ను కలిసిన శివారెడ్డినగర్ సంక్షేమ సంఘం సభ్యులు

కుత్బుల్లాపూర్: సంక్షేమ సంఘాలు కాలనీల అభివృద్ధిలో పాలు పంచుకోవాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కేఎం ప్రతాప్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ శివారెడ్డినగర్ సంక్షేమ సంఘం కార్యవర్గం రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికై న సందర్భంగా సోమవారం ప్రతాప్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో ఏ సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. సంక్షేమ సంఘం సభ్యులు సమష్టిగా కాలనీ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. సంక్షేమ సంఘం అధ్యక్షుడు సీహెచ్. వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు విఠల్, ప్రధాన కార్యదర్శి గోవింద్, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, ముఖ్య సలహాదారులు రామచందర్, నరసింహులు, హనుమంతరావు, కోశాధికారి కృష్ణ తదితరులు ఉన్నారు.

టికెట్ తగువులాట వదిలేసి సమస్యలు పట్టించుకోండి

- బీజేపీ రాష్ట్ర నాయకులు ఎస్.మల్లారెడ్డి
- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీపై తీవ్ర విమర్శలు



పారిశుద్ధ్య కార్మికురాలికి కరపత్రం అందజేస్తున్న ఎస్.మల్లారెడ్డి

జీడిమెట్ల: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజులకు టికెట్ గోల తప్ప ప్రజలకు మేలు చేసేది ఏమీ లేదని బీజేపీ రాష్ట్ర నాయకులు ఎస్.మల్లారెడ్డి విమర్శించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మహాజన సంపర్క్ కార్యక్రమాన్ని దుండిగల్ తండాలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

◆ అనంతరం ఆయన మాట్లాడుతూ.. పొద్దున లేచిన దగ్గర నుంచి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ×కుత్బుల్లాపూర్ టికెట్ నీకా.. నాకా.?×అని తగువులాడుకుంటున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలోని సమస్యలను పట్టించుకోవడం మరిచారన్నారు. టికెట్ తగువులాట వదిలేసి సమస్యలను పట్టించుకోవాలని హితవు పలికారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ పాలనలో ప్రజలకు కొత్తగా పెన్షన్లు, రేషన్‌కార్డులు ఇచ్చేందుకు సుముఖంగా లేరని ఆయన ఎద్దేవా చేశారు.

◆ తక్షణమే తండాలో ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లతో పాటు కొత్త పెన్షలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు గాలికి వదిలేసే ప్రజా నాయకులు బుద్ధి చెప్పాలన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ పార్టీకి ఓటు వేయాలని ఆయన ప్రజలను కోరారు. పాదయాత్రలో జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేష్, మాలోతు వెంకటేష్ నాయక్, జిల్లా ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి భాస్కర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం అందుబాటులోకి రాదా?



కల్యాణ మండపం వద్ద పార్క్ చేసిన వాహనాలు

చింతల్: భగత్‌సింగ్‌నగర్‌లోని మోడ్రన్ కల్యాణ మండపం అక్రమ పార్కింగ్‌లకు అడ్డాగా తయారైంది. సుమారు రూ.4.30 కోట్లతో నిర్మించిన మండపాన్ని మంత్రి కేటీఆర్ ప్రారంభించి ఆరు నెలలు గడిచినా ఇప్పటికి ప్రజలకు అందుబాటులోకి రాలేదు. కేవలం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంగా చలామణి అవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. పేరుకు కల్యాణ మండపంగా ఏర్పాటు చేసినా కంటి వెలుగు కేంద్రం, వార్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేశారన్నారు.

అనుమానాస్పదస్థితిలో కార్మికుడు ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: అనుమానాస్పదస్థితిలో ఓ భవన నిర్మాణ కార్మికుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన కంచన్ బర్మన్(20) పేట్‌బషీరాబాద్‌లోని ఆర్కే ఆస్పత్రి సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనంలో కార్మికుడిగా పని చేస్తే అక్కడే నివాసముంటున్నాడు. కాగా ఆదివారం రాత్రి భవనం రెండో అంతస్తులో ఫిల్లర్ రాడ్డుకు టవల్‌లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఉదయం తోటి కార్మికులు నిద్రలేచి చూడగా రాడ్‌కు వేలాడుతూ కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఎందుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడన్న విషయాలు తెలియరాలేదు.

గల్లీ రోడ్డు మూసివేత.. వాహనాల నిలిపివేత



షాపూర్‌నగర్ ఆంధ్రాబ్యాంక్ గల్లీ రోడ్డులో బారికేడ్ ముందు నిలుపుతున్న వాహనాలు

రంగారెడ్డినగర్: ట్రాఫిక్ పోలీసులు మూసివేసిన ఓ గల్లీ రోడ్డు మరమ్మతులకు వచ్చే వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారింది. షాపూర్‌నగర్‌లోని ఆంధ్రా బ్యాంక్ గల్లీకి వెళ్లే రోడ్డును జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనదారులు రాకపోకలు సాగించకుండా మూసి వేశారు. ఇదే అదనుగా భావించిన సమీపంలోని ఓ మెకానిక్ షెడ్డు నిర్వాహకుడు రిపేర్లకు వచ్చే బైక్‌లను నిలుపుతూ రోడ్డు ఆక్రమణకు పాల్పడుతున్నాడు. రాకపోకలకు సాగించకుండా బారికేడ్‌లతో మూసేసిన రోడ్డులో వాహనాలను నిలపడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డును మూసివేసిన ట్రాఫిక్ పోలీసులు బారికేడ్ల ముందు వాహనాలను నిలుపుతున్న మెకానిక్ షెడ్డు నిర్వాహకుడిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

కుత్బుల్లాపూర్‌లో కొత్తగా చేసిందేమీ లేదు

- బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్
- సుభాష్‌నగర్‌లో 'కుత్బుల్లాపూర్ గోస - శ్రీశైలం అన్న భరోసా'
- అప్పట్లో వేసిన రోడ్లనే మళ్లీ తవ్వి వేస్తున్నారని వ్యాఖ్య



సుభాష్‌నగర్‌లో పాదయాత్ర నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు కూన శ్రీశైలంగౌడ్

జీడిమెట్ల: తొమ్మిదేళ్ల పాలనలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలం అయ్యారని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. సోమవారం 'కుత్బుల్లాపూర్ గోస - శ్రీశైలం అన్న భరోసా'కార్యక్రమంలో భాగంగా ఆయన సుభాష్‌నగర్‌లోని పలు కాలనీల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో చేసిన అభివృద్ధి మాత్రమే కాలనీల్లో కనిపిస్తుందన్నారు. ఎమ్మెల్యే వివేకానంద కొత్తగా చేసిందేమీ లేదని విమర్శించారు. అప్పట్లో వేసిన రోడ్లనే మళ్లీ తవ్వి వేస్తున్నారని అన్నారు. డివిజన్ ప్రజలను కాలుష్యం నుంచి విముక్తి చేస్తానని ఇచ్చిన హామీని నేటికీ నెరవేర్చలేదన్నారు.

అధికారంలోకి రాగానే పరిష్కరిస్తాం..

◆ కాలనీల్లో పర్యటిస్తున్న కూన శ్రీశైలంగౌడ్‌కు స్థానికులు పలు సమ్యలను వివరించారు. దీనిపై స్పందించిన ఆయన బీజేపీ ప్రభుత్వం రాగానే ప్రజలకు కావాల్సిన అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. పాదయాత్రలో ఆయన వెంట బీజేపీ నాయకులు కార్యవర్గ సభ్యులు ఎంఎస్ వాసు, డివిజన్ అధ్యక్షులు కంది శ్రీరాములు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గిరిగె శేఖర్, అంగడి మల్లేష్, భీమరాజు, విజయేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కన్న తల్లిలాంటి టీఆర్ఎస్ పేరునే మార్చేసిన ఘనత కేసీఆర్‌దే..

అమరుల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో టీఆర్ఎస్ పార్టీ నుంచి తెలంగాణ అనే పదాన్ని తీసేసిన నీచమైన చరిత్ర కేసీఆర్‌ది అని శ్రీశైలంగౌడ్ విమర్శించారు. తప్పుడు పనిని సైతం గొప్ప పనిగా చెప్పుకోవడం ఒక్క కేసీఆర్‌కే చెల్లుతుందన్నారు. త్వరలోనే ప్రజలు కేసీఆర్ ప్రభుత్వానికి చమరగీతం పాడేందుకు ఎదురు చూస్తున్నారని అన్నారు.

గ్రీన్‌హిల్స్‌కాలనీ సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి

దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బహదూర్‌పల్లి గ్రీన్‌హిల్స్ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని దుండిగల్ కమిషనర్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, వంటి అభివృద్ధి పనులు జరగలేదని లేఖలో పేర్కొన్నారు. కాలనీ ప్రధాన సమస్యలైనా సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను త్వరగా ప్రారంభించాలని కోరారు. వినతిప్రతం అందజేసిన వారిలో బీజేపీ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ రాముగౌడ్, దాసరి శ్యాంరావు, దుండిగల్ మున్సిపల్ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.